# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

## మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 20 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయడి. ఇది అత్యవసరం !!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 10 జూలై 1990 సంచిక 12


## సంపాదకీయము

### దేవుని చిత్తము మారదు

### ( God's Will Does not Change )

" అయితే ప్రభువు వాక్యము ఎల్లప్పుడును నిలుచును " (1 పేతురు 1 : 24).

పంతొమ్మిది వందల సంవత్సరములకు పూర్వమే దేవుడు తన అంతిమ బయల్పాటును మానవులకు అందించాడు. నాటినుండి నేటి వరకు మానవుడు ఆయన వాక్యాన్ని అలక్ష్యం చేయ జూచాడు, మార్చ ప్రయత్నించాడు గాని దానిలో మాత్రం మార్పులేదు. పంతొమ్మిది వందల సంవత్సరముల క్రితము దేవుని దృష్టిలో ఏది పాపమో ఇప్పుడు కూడ అది పాపమే. పంతొమ్మిది వందల సంవత్సరముల క్రితము పాపములు క్షమించబడడానికి, రక్షణ పొందడానికి మానవుడేమి చేయాలని దేవుడు కోరాడో, దానినే నేడును ఆయన మానవునినుండి కోరుచున్నాడు. పంతొమ్మిది వందల సంవత్సరముల

క్రితం దేవుడు ఏ నరకాన్ని గూర్చి హెచ్చరించాడో, అదే నరకాన్ని గూర్చి నేడును హెచ్చరించుచున్నాడు. దేవుని చిత్తములోను, సంకల్పములోను, వాగ్దానములలోను ఎట్టి విధమైన మార్పు లేదు. కాలాని కనుగుణంగా దేవుడు మారడు. సమయానుకూలంగా ఆయన చిత్తం మార్చబడదు. దేవుని చిత్తము పరిపూర్ణమైనది. ఆయన మార్గము సంపూర్ణమైనది :

“దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతి యందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది” (2 తిమో. 3:16, 17).

మానవుల బోధలు, సిద్ధాంతములు నిరంతరం మారుచునే యున్నాయి. వాటిని ఉపదేశించు వారును మారిపోతున్నారు. ప్రజాదరణ పొందడానికి వారి ఉపదేశాలు మారిపోతూ వుంటాయి. వారి దృష్టిలో నిశ్చలంగా యుండేది యేదీలేదు. అంతా కాలానుగుణంగా మారిపోవాలంటారు. మానవులందరిని కలసికట్టుగా యుంచాలంటే, వారి యిష్టా యిష్టాలను మనం మన్నించాలని, తదనుగుణంగా మన బోధను మార్చుకోవాలని వారి యభిప్రాయం. అయితే నిజానికి ఇదే కారణంవలన మానవులు రకరకాలుగా, శాఖోప శాఖలుగా విడిపోయారు, క్రీస్తు ప్రార్థించిన ఏకత్వాన్ని సాధించలేక పోయారు (యోహాను 17 : 20, 21).

ఇట్టి మానవ కల్పిత ఎండమావినుండి బయటపడే మార్గం ఒకే ఒక్కటి యున్నది. ప్రజలు దేవుని తట్టును, ఆయన వాక్యము తట్టును తిరగాలి. కొందరు దేవునితో ఎప్పుడు కూడలేరు. అట్టి వారికి దేవుని దగ్గరకు తిరిగి రండని మనం చెప్పలేము. వారు ముందు దేవుని తెలిసికోవాలి. దేవుని చిత్తం మార్చబడదు గనుక ప్రజలు ఆయన వాక్యం

తట్టు తిరగాలి, ఆయన అధికారానికి లోబడాలి, ఆయన ఆజ్ఞలకు లోబడాలి. ఏలయనగా "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతి వాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును" అని యేసు ప్రభువు చెప్పాడు గదా (మత్త 7 : 21).

---

## ఎందుకు అనేక సంఘాలున్నాయి

**( Why are there so Many Churches ?)**

మనం చుట్టూ తిరిగి చూస్తే మనకేమి కనపడుచున్నది? ప్రతి చోటా సంఘాలున్నాయి. వివిధములైన సంఘాలు, వివిధబోధలతో, వివిధములైన నామాలతో దేవుని సేవించుటను మనం చూడగలము. ఎందుచేత ? కృపతో మాత్రమే రక్షింపబడగలమని కొన్ని సంఘాలు ఎందుకు బోధిస్తున్నాయి? కొన్ని విశ్వాసము వలన మాత్రమే రక్షింపబడుదుమనియు మరికొన్ని క్రియలద్వారా రక్షింపబడుదుమని ఎందుకు బోధిస్తున్నాయి ? మనము క్రీస్తునందు యేకమైయున్నామని చెప్పుచూ అనేక రక్షణ మార్గాలను ఎందుకు బోధించుచున్నాము ?

అనేక సంఘాలుండుటకు హేతువేదనగా దేవుని వాక్యాన్ని ప్రజలు ఎరుగక పోవుటయేనని నేను నమ్ముచున్నాను. మత్త 22:29లో యేసు ఒక ప్రశ్నకు సమాధాన మిచ్చుచు "లేఖనములనుగాని దేవుని శక్తినిగాని ఎరుగక మీరు పొరబడుచున్నారు". బైబిలేమి చెప్పుచున్నదో ఎరుగక వారు నమ్మిన . అనేక విషయాలను బోధించు చున్నారు. అపొస్తలుడైన పౌలు అతడు క్రైస్తవుడు కాక పూర్వము తన పాపజీవితములో జరిగించినవి "తెలియక అవిశ్వాసము వలన" చేసితినని చెప్పెను (1 తిమో 1 : 13). ఎరుగక పోవుటవలన క్షమాపణ

లభించదు. సత్యమును మీరు గ్రహించవలెనని దేవుడు సెలవిచ్చెను. "అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని" యేసు చెప్పెను (యోహా 8 : 32). సత్యమును గ్రహించుట ద్వారా సత్యమునకు మనము విధేయత చూపగలము. బైబిలేమి చెప్పుచున్నదో మనము గ్రహించని యెడల అనేక అబద్ధ బోధలలోనికి నడిపించబడుదుము.

దేవుని వాక్యాన్ని సరిగా బోధించని అనేకులుండుట కూడ అనేక సంఘాలుండుటకు మరో కారణము. పాపములోనికి నడిపించే అబద్ధ బోధకులను గూర్చి బైబిలు హెచ్చరించుచున్నది. (మత్త 24 : 24, II థెస్స 2 : 9-12, I తిమో 4 : 1-3 యింకా అనేక వచన భాగాలున్నాయి).

దేవుని వాక్యమును సరిగా ఉపదేశించవలెనని కూడ బైబిలు మనలను హెచ్చరించుచున్నది( II తిమో 2 : 15). "సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగా" జాగ్రత్త పడాలని మనలను బైబిలు హెచ్చరించుచున్నది. వాటిని సరిగా ఉపదేశించక పోయినట్లయితే మనం జాగ్రత్తగా లేమని దీని అర్థంకదా ! "నేను కారు నడిపే వాడినని" నీతో ఒకడు చెప్పినప్పుడు నీ కారును అతడు నడుపవలసియున్నది. అతడు దానిని సరిగా నడపలేక పోయినప్పుడు నీవు బాధల్లో చిక్కుకొంటావు, అతడు నీ కారును పాడుచేసి నిన్ను కూడ చంప వచ్చును.

అనేక సంఘాలుండుటకు మరో కారణం ఏదనగా ప్రజలు దేవుని వాక్యాన్ని గౌరవించుటలేదు. మన అధ్యక్షుని మనం గౌరవిస్తాం. ప్రధానులను, పితరులను మనం గౌరవిస్తాం. దేవుడు మాట్లాడినప్పుడు మనం వినడం లేదు. ప్రజలు దేవుని మాటను వినకుండ వాటేమి వినాలనుకున్నాడో దానినే విశ్వసిస్తున్నారు. కాని వినండి. దేవుని వాక్యానికి

ఏదైనా కలిపినా, తీసివేసినా లేక ఏ రూపంలో మార్పు చేసినా మనము శాపగ్రస్థులము (ప్రక 22:18-19, ద్వితీ 4:2, 2 యోహా 9). యేసు చెప్పెను: "వారు, మానవులు కల్పించిన పద్ధతులు దైవోపదేశము లని బోధించుచు నన్ను వ్యర్థముగా ఆరాధించుచుదురు" (మార్కు 7:7). క్రీస్తుద్వారా ఒక్కసారే అప్పగింపబడిన సత్యాన్ని అర్థము చేసికొనుటకు జాగ్రత్త పడవలెనని క్రొత్తనిబంధన బోధించుచున్నది (యూదా 3).

నా స్నేహితులారా, ప్రపంచములో అనేక సంఘాలున్నాయి. కాని వాటివలన దేవునికి సంతోషము లేదు. ఈ సంఘాలు అబద్ధ బోధకుల ద్వారా, లోకసంబంధమైన అజ్ఞానము వలన ఉద్భవించి నట్టివి. మనము యేకమై యున్నలాగున శిష్యులు మనయందు యేకమై యుండాలని క్రీస్తు దేవునిని ప్రార్థించెను (యోహా 17:20-21). క్రీస్తుకు సంఘమనే ఒకే ఒక శరీరము కలదని బైబిలు బోధించుచున్నది (ఎఫెస్సీ 4:4, 1:22-23). దేవునికి ఒకే ఒక సంఘము కలదు. కాని ప్రపంచములో అనేక సంఘము లున్నాయి. వీటి విషయమై దేవునికి సంతోష మేమాత్రమును లేదు. మనమేమి చేయవలెను? క్రొత్త నిబంధనలో ఏ సంఘాన్ని గూర్చి వ్రాయబడియున్నదో అందు సభ్యత్వము కలిగి యుండవలసి యున్నది. అదే మనం చేయవలసిన పని.

నీవు సత్యాన్వేషివైతే మేము నిన్ను యిట్టి సమూహములోనికి పిలుచుచున్నాము. మేము క్రైస్తవులముగా మాత్రమే నుందుము. మాకు భూసంబంధమైన ప్రధాన కేంద్రాలుగాని ప్రాంతీయ కార్యాలయాలు గాని, సమావేశాలు గాని, పరిపాలించే సమూహాలు గాని లేవు. యేసుక్రీస్తు క్రొత్త నిబంధనద్వారా యిచ్చిన సామాన్యమైన విధానములోనే ఆరాధింతుము. రక్షణను గూర్చి విశ్వాసమునుగూర్చి బైబిలేమి బోధించుచున్నదో దానినే బోధింతుము. మాతోటి సభ్యులను వ్యక్తిగతముగా విశ్వాసముయొక్క స్వాతంత్ర్యములో మంచి

జీవితము జీవించునట్లు ప్రతిదినము ఆనందముతో ప్రభువును సేవించుటకు ప్రోత్సహింతుము. క్రీస్తులో విశ్వాసముచేత మేము యేకమై యున్నాము.

మమ్మునుగూర్చి సేవికను తెలిసికొనగోరినట్లయితే క్రొత్త నిబంధన చదివి దేవుని ప్రజలు ఎట్టివారై యున్నారో గమనించి, మమ్మును చూసి, మాతో కలిసి వాక్యాన్ని పఠించండి. క్రొత్త నిబంధన క్రైస్తవ్యము యొక్క పునరుద్ధరణనుకోరే మాతో మీరు సహకరించండి. మతశాఖ తత్వము (అనేక సంఘాలు) క్రీస్తులో విశ్వాసాన్ని కోల్పోవుటకు దోహదపడుతుంది. మేము దేవుని ప్రజలముగా మాత్రమే ఉండి మానవకల్పిత బోధలను వ్యతిరేకించుచున్నాము. దేవుడే మహిమపర్చబడాలి. మానవుడు కాదు. యేసు చెప్పెను "నా సంఘమును కట్టుదును" (మత్త 16 : 18). క్రొత్తనిబంధనలో నున్న యీ సంఘమందుండుటయే మాగురి. క్రీస్తు ఆయన సంఘాన్ని స్థాపించినట్లయితే (ఆయన స్థాపించెను) వాక్యప్రకారముగా ఆ సంఘములోనే ఉండుటకు మనము ప్రయత్నించవలసి యున్నది. క్రీస్తుకు వెలుపల రక్షణలేదని మనమెరిగియున్నాము. (ఎఫెసీ 5 : 23; 2 తిమో 2:10). అందుచేత మనము క్రీస్తులోను ఆయన ప్రజలలోను ఉండుటకు అన్వేషణ సాగించాలి.

"మన వివాదము తీర్చుకొనుటకు" మీరు ఎందుకు రాకూడదు? (యెష 1 : 18). క్రొత్తనిబంధన మార్గమును గూర్చి మీకు ఆసక్తి యున్నదా? స్వచ్ఛమైన, సామాన్యమైన క్రైస్తవ్యమునుగూర్చి మీకు ఆసక్తి లేదా? ఉన్నదని నా అభిప్రాయము. మమ్ములను సంప్రదించండి. మేము "క్రీస్తు సంఘములు" అని పిలువబడుట మీరు గ్రహించగలరు. రండి క్రొత్తనిబంధన క్రైస్తవ్యముయొక్క పునరుద్ధరణనుకోరే మాతో మీరు కలవండి. ★

—డాన్ మెక్వే, క్రీస్తు సంఘము, ఆశ్రా, ఘనా.

# "ఎందుకు" అని యేసు అడుగుచున్నాడు

## ( Jesus asks "Why". )

అనేక సందర్భములలో తన బోధలను వినువారిని యేసు "ఎందుకు" అని అడిగినట్లు చూడగలము అట్టి కొన్ని ప్రశ్న లీదిగువ నీయబడినవి.

ఎందుకు చింతించుచున్నావు ? "వస్త్రములను గూర్చి మీరు చింతింపనేల ? అడవి పువ్వులు ఏలాగు నెదుగుచున్నవో ఆలోచించుడి. అవి కష్టపడవు, ఒడకవు అయినను తన సమస్త వైభవముతో కూడిన సొలొమోను సహితము వీటిలో నొక దాని వలెనైనను అలంకరింపబడలేదు. నేడుండి రేపు పొయిలో వేయబడు అడవిగడ్డిని దేవు డీలాగు అలంకరించిన యెడల, అల్పవిశ్వాసులారా, మీకు మరి నిశ్చయముగా వస్త్రములు ధరింపజేయును గదా (మత్తయి 6 : 28-30). పువ్వుల యొక్క జీవిత పరిధి స్వల్పమైనప్పటికి దేవుడు వాటికి అద్భుత సౌందర్య మనుగ్రహించినాడు. అట్టి దేవుడు తన పిల్లలకు సహాయము చేయడా ?

ఎందుకు తీర్పు తీర్చుదువు ? "మీరు తీర్పు తీర్చకుడి అప్పుడు మిమ్మును గూర్చి తీర్పు తీర్చబడదు. మీరు తీర్చు తీర్పు చొప్పుననే మిమ్మును గూర్చియు తీర్పు తీర్చబడును. మీరు కొలుచు కొలత చొప్పుననే మీకును కొలువబడును. నీ కంటిలో నున్న దూలము నెంచక నీ సహోదరుని కంటిలో నున్న నలుసును చూచుట యేల" ? (మత్తయి 7 :1-3). దూలము వంటి మన తప్పుల నెంచక ఇతరుల యొక్క దోషములను యెంచుదుము. కాబట్టి మొదట మన లను మనము పరీక్షించుకొని జీవితములను దిద్దుకొనుమని యేసుక్రీస్తు బోధించినారు. అపుడు మనకు ఇతరుల యెడల స్పష్టమైన అవగాహన యేర్పడును (మత్తయి 7 : 4, 5).

ఎందుకు మానవ సిద్ధాంతములకు లోబడి దేవుని సేవించుచున్నారు? "మీరును మీపారంపర్యాచారము నిమిత్తమై దేవుని ఆజ్ఞను ఎందుకు అతిక్రమించుచున్నారు? (మత్త 15 : 3). మానవులకు అనుగ్రహింపబడిన దేవుని పరిపూర్ణ చిత్తమే బైబిలు గ్రంధము నేడు మనము దేవుని ఆరాధించి, సేవించుటకు అవసరమగు నియమము లన్నిటిని ఆయన క్రొత్తనిబంధన గ్రంధములో బయలు పరచినాడు. మతసంబంధ విషయములలో మానవ సిద్ధాంతములకు పారంపర్యాచారములకు మనము విధేయత చూపినచో అట్టి ఆరాధన దేవునికి అంగీకారమైనది కాదు. "మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" (మత్త 15 : 9).

దేవునికి లోబడక ఎందుకు ప్రభువా అని పిలుచుచున్నారు ? "నేను చెప్పు మాటల ప్రకారము మీరు చేయక-ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు? (లూకా 6:46). మన పెదవులు "ప్రభువా" అని వుచ్ఛరింప వచ్చునుగాని మన జీవితములు ఆయనను తిరస్కరించుచున్నవి. సమస్త విషయములలోను మనము క్రీస్తుకు లోబడవలసియున్నది. "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" (మత్తయి 7 : 21).

— రోయిస్ ఫ్రెడరిక్.

---

# సంగీతములతో అనగా వాయిద్యములతో అను అర్థమా ?

## ఎఫెసీ 5 : 19, 20. కొలస్స 3 : 16-17

పై వచనములందుగల "సంగీతములతో" అను మాటను బట్టి క్రైస్తవ ఆరాధనలో వాయిధ్యములను సమర్థించువారున్నారు. అయితే ఆవాక్యములను చదివి ధ్యానించిన యెడల పరిశుద్ధాత్మని యొక్క ఆవాక్య భావమును మనము తెలిసికొనగలము.

ఇక్కడ చెప్పబడిన అంశములు -

1. సంగీతములు
2. ఆత్మసంబంధమైన పాటలు
3. కీర్తనలు
4. ఆత్మసంబంధమైన పద్యములు
5. హృదయములలో గానము

పైన పేర్కొబడిన ఈ అంశములు సంఘమందు వినియోగించుట వలన సభ్యులైన ప్రతి ఒక్కరు ఎట్టి అనుభూతి చెందుచుందురని, లేక చెందవలెనని లేఖనము చెప్పుచున్నది ?

1. సమస్తవిధములైన జ్ఞానము నేర్పును.
2. ప్రతివారి హృదయములలో క్రీస్తు వాక్యము సమృద్ధిగా నివసింప నిచ్చును.
3. ఒకని వలన ఒకడు బోధింపబడును.
4. ఒకనికి ఒకడు బుద్ధిచెప్పుకొనును.
5. ఒకని నొకరు హెచ్చరించు (మేల్కొలుపు) కొనుచుండును.

మరియు సంఘము ఆ విధముగా గానము చేయుటవలన దేవునితో కలుగు అనుబంధము ఏమైయుండునని లేఖనము చెప్పుచున్నది ?

1. ప్రభువును కీర్తించుట.
2. యేసుక్రీస్తు పేరట తండ్రియైన దేవునికి కృతజ్ఞతస్తుతులు చెల్లించుట జరుగవలెను.

పైన పేర్కొనబడిన రెండు అంశములుకూడా ప్రతిఒక్కరు తమ హృదయములలోనుండి గాత్రమెత్తి జిహ్వాఫలములను అర్పించుట ద్వారా మాత్రమే సాధ్యమగును. వాయిద్యములు ఆ పని చేయలేవు.

| | |
|---|---|
| సంగీతములు | బోధించును, బుద్ధిచెప్పును, హెచ్చరించును, |
| కీర్తనలు, పాటలు | జ్ఞానమునేర్పును, స్తుతించును, క్రీస్తువాక్యాన్ని |
| పద్యములు గానములు | హృదయాలకు హత్తుకొనజేయును. |

ఈ రీతిగా సంగీతములు, కీర్తనలు, పాటలు, పద్యములు, గానములు ఏకగ్రీవముగా పైన పేర్కొనిన అంశములలో సంఘమును నడిపింప సాధ్యమగును. అయితే సంగీతములతో అనగా వాయిద్యములతో అను అర్థము మనము తీసికొన్నయెడల వాయిద్యముల వలన కలుగు నిర్జీవనాదము సంఘమునకు, లేక ఒకరికి బోధించతగునా? బుద్ధి చెప్పుట సాధ్యమా? హెచ్చరించ వల్లపడునా? జ్ఞానము ఉపదేశింపగలవా? క్రీస్తు వాక్యాన్ని హృదయాల్లో నింపగలవా? దేవుని స్తుతించి, కీర్తించగలవా? ఆలోచించండి. నిర్జీవనాదమిచ్చు వాయిద్యములు జీవముగల సంఘమునకు అవసరమగు ఆత్మీయతను ఏమి అందించగలవు?

ఇందువలన "సంగీతములతో" అనగా వాయిద్యములతో అనికాదు సంగీతములతో అనగా హృదయంలో నుండి వెలువడే పద్యములు, పాటలు, కీర్తనలు, గీతములు మొదలగు గానములతో అనియేగాని నిర్జీవ నాదము యిచ్చే వాయిద్యాలతో మాత్రం కాదు.

తప్పక సంగీతములతో బోధ, బుద్ధి, జ్ఞానము, హెచ్చరిక క్రీస్తు వాక్య అనుభవము, స్తుతియాగము, దేవుని కీర్తి హృదయములలో నుండి సమృద్ధిగా చేయాలి. సంగీతములు సజీవులై విమోచింపబడిన సంఘసభ్యుల హృదయములలోనుండి మాత్రం గానముచేయాలి. సంగీతములతో అను క్రియ హృదయములలోనుండి వెలువడె జిహ్వా ఫలములు మాత్రమే. లేఖనము ఏమిచెప్పుచున్నది?

"ఎవరికైనను సంతోషము కలిగెనా? అతడు కీర్తనలు పాడవలెను" (యాకో 5:13). వాయిద్యాల సంగతిలేదు.

"అంతట వారు కీర్తన పాడి ఒలీవకొండకు వెళ్ళిరి" (మత్త 26:36). ఇక్కడకూడా వాయిద్యాలు లేవు. అవసరమనుకుంటే సామగ్రితో నిండియున్న ఆ గొప్ప మేడగదిలో వాయిద్యాలుకూడా సమకూర్చుకొనుటకు సాధ్యమేగదా? (మార్కు 14:15).

"ఆత్మతో పాడుదును, మనస్సుతోను పాడుదును" (1 కొరి 14:15). తంబురతో పాడుదును, తంతివాయిద్యములతో పాడుదును అనలేదు.

పితరులతో ప్రవక్తలు మాట్లాడినపుడు వారికి వాయిద్యముల సంగతి చెప్పెను గాని మనతో క్రీస్తు మాట్లాడినపుడు వాయిద్యము సంగతి చెప్పలేదు. హృదయాల్లోనుండి జిహ్వాఫలములు అర్పించాలి అని మాత్రమే చెప్పెను.

విచారము ఏమనగా క్రీస్తునందు విశ్వాసముగలవారై క్రీస్తు నామమున ఆరాధించేవారనేకులు సిద్ధాంతపరమగు విభేదములు కలిగియున్నను వాయిద్యములను ఉపయోగించుటలో మిక్కిలి సన్నిహితులై యున్నారు.

వాయిద్యముల వలన కలుగు నిర్జీవనాదము శరీర సంబంధమైన

మనస్సును ఉల్లాసపరచి ఉప్పొంగజేయును. అందువలన అనేక విధము లగు ఆటలు, నాట్యములు మొదలైనవి వాయిద్యనాదముతోనే ఉల్లాసంగా, ఉత్సాహముగా శరీర సంబంధమగు ఆకర్షణతో అనేకులను ఆనందమయము చేయుచున్నవి. క్రైస్తవ ఆరాధనకూడా ఆత్మీయతను కోల్పోయి శరీర సంబంధమగు మనస్సును ఉల్లాసపర్చుకొంటూ ఆరాధించుట దేవుని చిత్తమా?

"అందువలన మనము నిశ్చలమైన రాజ్యమునుపొంది, దైవకృప కలిగియుందము. ఆ కృప కలిగి వినయ భయభక్తులతో దేవునికి ప్రీతి కరమైన సేవ చేయుదము. ఏలయనగా మన దేవుడు దహించు అగ్నియై యున్నాడు" (హెబ్రీ 12:29).

దేవుడు "మనుష్యుల చేతులలో సేవింపబడువాడు కాడు" (అ.కా. 17:25). సత్యమును వెదకి దానిని చేపట్టుడి (సామె 23:23).

—పాల్ గూటం, గొల్లవిల్లి.

---

## తీర్పుదినము నిజం !

### ( Judgement Day is Real )

భావిలో ఒక తీర్పు దినమున్నదని ప్రజలు మరచిపోయినట్లు న్నారు. అనేకులు తమ యిష్టము వచ్చినట్లు జీవిస్తూ, తీర్పుదినము నిత్యత్వము అనునవి లేనే లేనట్లు భావించుచున్నారు. అట్టివారికి బైబిలులో కనబడు పరలోకము, నరకము, తీర్పు అనునవి నిజం కాదు. అయితే ఒకని జీవితంలో తీర్పుదినము మాత్రం చాల నిజం, తీర్పు యొక్క యధార్థతను గ్రహించుటకు మత్తయి 25వ అధ్యాయం నుండి మూడు ముఖ్యమైన మాటలను మనం గ్రహించవచ్చును.

## 1. అది నిశ్చితమైనది

తీర్పు నిశ్చితమైనదని బోధించు రెండు బైబిలు సంఘటన లున్నాయి. "తన మహిమతో మనుష్య కుమారుడును ఆయనతో కూడ సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమగల సింహాసనము మీద ఆసీనుడై యుండునని" యేసు ప్రభువు బోధించారు (మత్త 25:31). అంటే క్రీస్తు రెండవ రాకడ ఎంత నిశ్చితమో, తీర్పుకూడ అంత నిశ్చితం. అపొ. కా. 17 : 30-31 లో లూకా ద్వారా దేవుడిట్లు పలికాడు : "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్లుగా ఉండెను. ఇప్పుడైతే అంతటను, అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు. ఎందుకనగా తాను నియమించిన మనుష్యుని చేత నీతిననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించియున్నాడు. మృతులలో నుండి ఆయనను లేపినందున దీనిని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసి యున్నాడు". గనుక క్రీస్తుయొక్క పునరుత్థానము, రెండవ రాకడ ఎంత నిశ్చితమో తీర్పుకూడ అంతే నిశ్చితం!

## 2. అది యథార్థం

భౌతిక మరణానికి తీర్పుకు దేవుడు సంబంధమేర్పరచాడు. "అయితే ఆయన యుగముల సమాప్తియందు తన్ను తానే బలిగా అర్పించుకొనుటవలన పాపనివారణ చేయుటకై యొక్కసారే ప్రత్యక్షపరచబడెను. మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను. ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:26, 27). మరణం ఎంత నిజమో తీర్పు అంత నిజం!

## 3. నిత్య ఎడబాటు

మనం ప్రయాణాలు చేయునప్పుడు ఒకరినుండి మరొకరికి ఎడబాటు కలుగుతాది. ఈ భూమిపై వివిధములైన ఎడబాట్లు సంభవి

స్తాయి. అయితే తీర్పులో జరిగే ఎడబాటు నిత్యము ఉంటాది. తీర్పు నాడు అన్ని జనాంగములవారు క్రీస్తు సింహాసనము యెదుట నిలుస్తారు. ఒకడు గొర్రెలనుండి మేకలను వేరుచేయునట్లు ఆయన నీతిమంతులను అనీతిమంతులను వేరు చేయును. "వీరు నిత్యశిక్షకును, నీతిమంతులు నిత్యజీవమునకును పోవుదురు" (మత్తయి 25 : 46). ఏయే గుంపులో ఎవరెవరు ఉందురో నీవెన్నడయినను ఆలోచించావా? ఈ దిగువ సంగతుల నాలోచించుము:

i) సంఘము లోకమునుండి వేరౌతాది. "ఈ లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించినయెడల తండ్రి ప్రేమ వానిలో యుండదు. లోకములో ఉన్న దంతయు అనగా శరీరాశయు నేత్రాశయు జీవపుడంబమును తండ్రి వలన పుట్టినవి కావు; అవి లోకసంబంధమైనవే" (1 యోహాను 2:15, 16). సంఘము దేవుని రాజ్యము, లోకము సాతాను సామ్రాజ్యము. కడవరి తీర్పులో ఇవి వేరుచేయబడును.

ii) పరిచర్యచేయని వారినుండి క్రైస్తవులు వేరుచేయబడుదురు. మత్తయి 25లో ఆకలిగొన్న వారికి ఆహారము, దప్పిగొన్న వారికి దాహముయిచ్చుట, రోగులను దర్శించుట మొదలగు సంగతులనుగూర్చి అందుకే ఆయన చెప్పారు.

iii) క్రీస్తునందు నమ్మకముగాయున్న వారినుండి అపనమ్మకముగా యున్నవారు వేరుచేయబడుదురు. "శరీరకార్యములు స్పష్టమైయున్నవి; అవేవనగా జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితోకూడిన ఆటపాటలు మొదలైనవి...వాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరు" (గలతీ 5:19:21). సంఘసభ్యుడు

శరీర కార్యములకు లోనై అదే స్థితిలో మరణించినయెడల తీర్పులో అతడు ఎడమవైపునకు పోవును.

తీర్పుదినం నిశ్చితం, అది యథార్థం. దానిలో సంభవించేది నిత్య ఎడబాటు. మనం మరణించిన తరవాత తీర్పు తప్పించుకోలేము. నిత్యత్వాన్ని పరలోకంలోగాని, నరకములోగాని గడుపుట తప్పదు.

—విల్లార్డ్ కోలిన్స్.

---

## యాత్రికుల ప్రయాణము - ఆయుష్కాలం

ప్రపంచములో దేవుని దయవలన బ్రతుకుచు చలించుచు ఉనికి కల్గిన సర్వశరీరులు (అపో. కా. 17 : 28), మేము యాత్రికులం, పర దేశులం అనే నిజాన్ని గుర్తించలేకున్నారు. ప్రకృతి సంబంధికి మానవజీవితంలో చెప్పుకోదగిన గమ్యంలేదు. కాబట్టి రేపు చనిపోదుము తినుము త్రాగుమనెడివారును (యెషయా 22 : 13; లూకా 12:9), జీవితం సమాధిలో అంతమనెడి సద్దూకయ్యులను పోలినవారును కలరు (అపో.కా. 23:9). ప్రభువు త్యాగం సిలువమరణం, సమాధితో అంతంగాక ఖాళీసమాధిలో మరణమును ఖైదీగజేసి (మార్కు 16:6), మానవజీవితమునకు అర్థమును, వాని గమ్యమునకు జీవమును పోసినది. తద్వారా జీవమును, అక్షయతను వెలుగునకు తెచ్చి నిరీక్షణ నొసగెను (II తిమోతి 1:10).

భూమి మానవ నివాసయోగ్యమైనప్పటికిని (యోబు 37:12) నిలువరమైన పట్టణం ఎవరికి లేదని ఒప్పుకోవాలి (హెబ్రీ 13:14). దేవుడు ఆదాముతో నీవు మంటినుండి తీయబడితివి గనుక తిరిగి మన్నై పోదువనెను (ఆది కా. 3 : 19). దేహంలో ఆత్మ దేవునియొద్దకే పోతుంది (ప్రసంగి 12 : 7). ఎందుకంటే ఆత్మ యెహోవా పెట్టిన

దీపము (సామెతలు 20:27). మానవుడు తృణప్రాయుడు, భూమియు శాశ్వతమైనది కాదు (కీర్తనలు 103 : 14-15); (II పేతురు 3:10). కారణం దృశ్యమైనవి అనిత్యములు, అదృశ్యమైనవి నిత్యములు (II కొరింథీ 4:18).

## వయో పరిమితి

ఆదాము వంశావళిలో 930 సం॥ మొదలు 969 సం॥ల వరకు బ్రతికినా (ఆది కా. 5 : 1-27) సృష్టిలో మానవుడు శాశ్వతంగా జీవించే అవకాశభాగ్యాన్ని పాపమునుబట్టియే కోల్పోయెను (ఆది కా. 3:22). లోకంలో పాపం విస్తరించి తమ అక్రమ విషయంలో నర మాత్రులైనందున దేవుడు వారి దినములు 120 యేండ్లుగ జేసెను (ఆది కా. 6 : 3). మన ఆయుష్కాలం 70 సం॥లు. అధికబలమున్న యెడల 80 సం॥లు. అయినను వాటి వైభవం ఆయాసమే దుఃఖమే యని మోషే చెప్పెను (కీర్తన 90 : 12). యిట్లు దేవుడు మనుష్యుల వయోపరిమాణమును పరిమితి చేసెను.

యాకోబు ఫరో యెదుట నిలచి రాజును దీవించి తన సంభాషణలో, తాను 130 సం॥లు యాత్ర చేసినట్లు పలికెను (ఆది కా. 47:7). దావీదు మరణకాలమందు లోకులందరు పోవలసిన మార్గమున నేను పోవుచున్నానని సొలొమోనుతో చెప్పెను (1 రాజు 2:1-2). మా పితరులవలె మేమును నీసన్నిధిని అతిథులము పరదేశులమై యున్నామని భూనివాసకాలము నీడయంత అస్థిరం. స్థిరముగా నున్న వారెవరును లేరని ఒప్పుకొనెను (1 దినవృ. 29:15).

అబ్రహామునుండి అనేక విశ్వాసవీరుల జీవిత యాత్రలో, వీరంతా ఆ వాగ్దాన ఫలములను అనుభవింపక పోయినను, దూరము నుండి చూచి వందనములు చేసి తాము భూమిమీద యాత్రికులం అని ఒప్పుకొని విశ్వాసంగలవారై మృతి పొందిరి. వీరందరు పరలో

కాన్ని వెదకుచున్నామని విశదపరచుచున్నారు కారా? (హెబ్రీ 11 : 13-15).

ఆయా దేశములయందు చెదరిన యాత్రికులకు - పేతురు తన పత్రికలో సర్వశరీరులు గడ్డిని పోలిన వారని చెప్పెను ( I పేతురు 1 : 1-2; 24). ఆదాము 930 సం॥ మెతూషెల 969 సం॥ జీవించిరి (ఆది. కా. 5 : 5, 27). యాకోబు చెప్పినట్లు కొంతసేపు కనబడి అంతలో మాయమైపోవు, ఆవిరివంటివారైనా సరే (యాకోబు 4:14), దేవుడు నరులారా, తిరిగి రండని సెలవిస్తూ వారిని మంటికి మార్చుచున్నాడు. ఆయన దృష్టికి 1000 సం॥లు గతించినా నిన్నటిదినమును రాత్రియందలి యొక జాముపలె యున్నవి (కీర్తనలు 90:3-4).

మనము విలువపెట్టి కొనబడి దేవుని సొత్తయిన ప్రజలమై యున్నాము (1 కొరింథీ 6:20). కాబట్టి దేహంలో ఉన్నంతకాలము ప్రభువుకు దూరంగా ఉన్నామని గ్రహించి, ధైర్యము కల్గి, దేహమందున్నను దేహాన్ని విడచినను ఆయన కిష్టులమై యుండాలి. (II కొరింథీ 5 : 7-8).

ఈ జీవితకాలము మట్టుకే మనము క్రీస్తునందు నిరీక్షించువారమైనయెడల మనుష్యులందరికంటె దౌర్భాగ్యులమై యుందుము (1 కొరింథీ 15 : 19). అందుచే ప్రభువు రాకడ నిమిత్తము పరలోకము కొరకును నిరీక్షించి, నీతిని భక్తిని కొనసాగిస్తు (యోహాను 14 : 1-4; తీతు 2:13) ప్రభువు అడుగుజాడల్లో నడచుకుంటేనే (1 పేతురు 2:21) యాత్రికులు తమ గమ్యం చేరగలరు.

—G. ప్రకాశం, పెరంబూరు, మద్రాసు -12.

# "సత్యమును అమ్మివేయక దాని కొని యుంచుకొనుము"

సామె 23 : 23

## ( Buy the Truth and Sell it Not )

జ్ఞానియైన సొలొమోను పరిశుద్ధాత్మ ప్రేరణచేత చేసిన ఉప దేశాల్లో ఇదొక ఆణిముత్యం. సత్యము అమ్మబడినప్పుడు దాని ద్వారా వచ్చే ప్రయోజనం అమ్మినవారికి చేకూరదు. దాని కొని యుంచుకొనిన వారు దాని వలన చేకూరే ప్రయోజనాన్ని, ఆనం దాన్ని పొందగలుగుతారు. సత్యాన్ని కొందరు ఎట్లు విక్రయిస్తున్నా రనేది చర్చనీయాంశమే.

"నీ వాక్యము సత్యము" (యోహాను 17 : 17). యిది ప్రభు వైన యేసు సత్యము అనే పదానికి చెప్పిన నిర్వచనం. "నేనే సత్యము" (యోహా 14 : 6) అని యేసు బోధించెను. "ఆవాక్యము శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను" (యోహా 1:14). దీనిని బట్టి వాక్యమే సత్యమని, వాక్యమే కుమారుడని ఋజువగు చున్నది.

## సత్యము ద్వారా స్వాతంత్ర్యము

"సత్యము మిమ్ములను స్వతంత్రులనుగా చేయునని" యేసు బోధించెను (యోహా 8 : 32). సత్యము అమ్మబడినప్పుడు స్వాతం త్ర్యము లేదు. "పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. దాసుడెల్లప్పుడును ఇంటిలో నివాసము చేయడు, కుమారు డెల్లప్పుడును నివాసము చేయును. కుమా రుడు మిమ్ములను స్వతంత్రులనుగా చేసిన యెడల మీరు నిజముగా స్వతంత్రులై యుందురు" (యోహా 8:34-36). పాపమునకు దాసులైన మానవులకు స్వాతంత్ర్యము సత్యము ద్వారా కలుగుచున్నది. సత్య

మును కొనియుంచు కొనిన వారు అనగా సత్యమునకు విధేయత చూపినవారు స్వతంత్రులని దీని సారాంశము.

## వాక్య సారాంశము

"నీవాక్య సారాంశము సత్యము" (కీర్త 119 : 160). సత్యాన్వేషికి ఇది చాలా ప్రాముఖ్యమైన వచన భాగము. అపొస్తలుల కార్యములు 16 : 30 చదివి రక్షింపబడుటకు విశ్వాసము మాత్రమే చాలునని కొందరు బోధించుచున్నారు.

31వ వచనములో చెరసాల నాయకుడు, అతని యింటివారు బాప్తిస్మము పొందిన సంగతిని వారు చదువరు, చదివినా వారు గ్రహించ లేక పోవుచున్నారు. విశ్వాసము వలన ఒకడు రక్షింపబడును. విశ్వాసము మాత్రమే ఒకని రక్షించలేదు. లూకా 13:3 చదివి విశ్వాసము, మారుమనస్సు చాలునని కొందరు వాదించుచున్నారు. విశ్వాసము, మారుమనస్సు క్రీస్తు ప్రభువని నోటితో ఒప్పుకొనుట, బాప్తిస్మము ఈ ఆజ్ఞలన్నిటికి విధేయత చూపాలనేదే వాక్య సారాంశము. అదే సత్యము. వీటిలో ఏ ఆజ్ఞనూ తీసివేసే అధికారం ఏ మానవునికీ లేదు. ఇది సంపూర్ణమైన దేవుని చిత్తము. ఈ సత్యాన్ని నీవు కొని యుంచుకోవాలి. రక్షణలో కొనసాగాలి.

## సత్యానికి స్థంభము

"ఆ సంఘము సత్యమునకు స్థంభమును ఆధారమునై యున్నది (I తిమో 3 : 15). ఇది దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన ఒకే ఒక సంఘము. అది సత్యమునకు స్తంభమునై యున్నది. ఈ సంఘములో సభ్యత్వము పొందిన వారికి గొప్ప ఆధిక్యత లివ్వబడ్డాయి. వీరికి ఒక చట్టమున్నది. ఆ చట్టాన్ని సవరించే అధికారము వీరికి లేదు. వీరికి వాగ్దానాలున్నాయి, మతశాఖలనే మానవ కల్పిత సంఘాలతో

వీరికేట్టి పొత్తు ఉండదు. సంక్షేమ కార్యక్రమాల పేరుతో ఆర్థిక సహాయాన్ని పొందుచూ దాన్ని సమర్థించు కొనే నిమిత్తము "నేను సత్యమునే ప్రకటించుచున్నాను" అని చెప్పేవారున్నారు. కొందరు మతశాఖల ఆర్గనైజింగ్ కమిటీలలో సభ్యులుగా కొనసాగుచున్నారు. ఇది మతశాఖల సిద్ధాంతాలతో పరోక్షంగా ఏకీభవించడమే అవుతుంది "సత్యమును అమ్మివేయక దాని కొని యుంచుకొనుము".

## వాక్యమే వెలుగు

"నీ వాక్యము వెల్లడి అగుట తోడనే వెలుగు కలుగును" (కీర్త 119 : 130). సత్యము అమ్మబడినప్పుడు వెలుగు లేదు. చీకటి మిగులుతుంది. చీకటి అనేక దుష్పరిణామాలకు దారి తీస్తుంది. నీవు వెలుగును లేదా నీ పాదములకు దీపమును కొని యుంచుకొనవలసిన అవసరమున్నది. అప్పుడు నీ జీవితానికి నిజమైన ఆనందం కలుగుతుంది.

"దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెననెను" (యోహా 4 : 24). సత్యముతో ఆరాధింపవలెనను మాటకు వాక్యానుసారముగా ఆరాధించాలని అర్థము.

"సత్యమందు వారిని ప్రతిష్ఠ చేయుము" అని యేసు, తండ్రిని ప్రార్థించెను. దుష్టుని నుండి వారిని కాపాడి సత్యమునందు వారిని ప్రతిష్ఠచేయుమని యేసు ప్రార్థించెను. ఇచ్చట వాక్యము యొక్క ప్రాముఖ్యము మనకు కనబడుచున్నది. వాక్యమందు అందరు నిలిచి యుండాలని యేసయ్య కోరిక.

సత్యాన్వేషికి సత్యము దొరుకుతుంది. కొందరికి సత్యము అవసరములేదు. ధనము, పలుకుబడి, హోదా కావాలి. వీటి కోసం సత్యమును అమ్మివేయడం వలన కలిగే పరిణామ మేమిటో గ్రహించాలి.

యేసును 30 వెండి నాణెములకు అమ్మిన వాని చరిత్రలో అతడు పోగొట్టుకొనిన విషయాలను మనం ఎరుగుదుము. సత్యమును అమ్మివేయక దాని కొని యుంచుకొనుటలో నున్న ఆనందాన్ని పొందుదాం!

— B. K. V. ప్రసాదరావు, చెయ్యేరు.

---

## ఎక్కడ నిలుతురు ?

కుక్క ఎట్టి జాతి దయినా
కక్కి తినుట సహజమే లే
నక్క వర్గ మెట్టిదయినా
టక్కరి పని మానదు లే

నిక్కమైన క్రైస్తవులలో
కుక్క నక్క క్రియలుండిన
లెక్కలడిగే వానిముందు
ఒక్కరైనా నిలిచేనా ???

నీతిసహిత బాటసారీ...
పేతురు పత్రికలు చదువు
లేఖన సారాంశ మెరిగి
క్రీస్తు సముఖమందు నిలువు!

— యస్. జె. మేడిద, కొణితివాడ.

# కాకినాడ బిల్డింగు వివరములు

దేవుని మహిమార్థమై కాకినాడలో నిర్మించుచున్న బిల్డింగు పని చురుకుగా సాగుచున్నది. ప్రస్తుతం కాంక్రీటు స్థంభము లన్నియు నిలబెట్టుట జరిగినది మరియు 25-6-90 నాడు పోర్టికో స్లేబ్ వేయుట జరిగినది. ఇప్పుడు మొదటి అంతస్థుయొక్క స్లేబ్ వేయుటకు తగు ప్రయత్నములు జరుగుచున్నవి. ఈ దిగువ నుదహరించినవారు కాకినాడ బిల్డింగుకు విరాళములు పంపిరి. వారందరికీ మా హృదయపూర్వక వందనములు :

| | | |
|---|---|---|
| Bro. P. ప్రశాంతం, పూరీ, ఒరిస్సా | Rs. | 150-00 |
| V.V. రాఘవులు, కొత్తలంక | | 100-00 |
| K. విమల విక్టోరియా, పాకాల | | 100-00 |
| K. రత్నావళి ప్రభుదాస్, నెల్లూరు | | 100-00 |
| K. అప్పారావు, సత్తెనపల్లి | | 50-00 |
| M. పాల్‌రాజు, చీపురుపల్లి | | 500-00 |
| ఎలిషే కరుణవేణి, చెయ్యేరు | | 100-00 |
| Sk. మస్తాన్ సాహెబ్, T. రాయవరం | | 100-00 |
| G. మార్కుగారి ద్వారా, నందిగామ | | 300-00 |
| K. సంతోషం, నర్సారావుపేట | | 100-00 |
| V. దానియేలు, K.R. పాలెం | | 50-00 |
| K. స్వామిదాస్, నెల్లూరు | | 200-00 |
| S. సిలువాద్రి, ములియపుట్టి | | 100-00 |
| G. విమలకుమారి, విజయవాడ | | 100-00 |
| Ch. జాన్‌బాబ్, ముంగంత | | 300-00 |

| | |
|---|---|
| R.Ch. సద్గుణరావ్, శ్రీకాకుళం | 225-00 |
| G. శాంతరత్నం, ఏలూరు | 50-00 |
| D. పుల్లయ్య, కూనవరం | 100-00 |
| P. శ్యామసుందరరావ్, మోతుగూడెం · | 500-00 |
| K. ఇశ్రాయేలు, కంభంపాడు | 100-00 |
| Dr. P.N. విజయభాస్కర్, నాగార్జునసాగర్ | 100-00 |
| B. సువార్తమ్మ, కేసరపల్లి | 200-00 |
| N. లిడియమ్మ, చింతలచెరువు | 30-00 |
| B. మోహాను, పల్లంకుర్రు | 100-00 |

## సంక్షిప్త వార్తలు

1. జూన్ నెలనుండి పోస్టల్ రేట్లు విపరీతముగా పెరిగినవి. అందువలన రేడియో ప్రసంగ పుస్తకములు, బైబిలు కరస్పాండెన్సు కోర్సు పాఠములు, సత్యవాక్కు పంపించుట ఇప్పుడు మరింత ఖరీదయినది. సత్యవాక్కు పోస్టేజీనిగూర్చి ఇంకా అధికారులనుండి సరియైన వివరణ మాకు అందలేదు. పెరిగిన ఖరీదులను బట్టి ప్రభువు పనికి ఆటంకము కలుగకుండునట్లు ప్రార్థించండి.

2. సోదరులు జె.సి. బెయిలీగారి ఆరోగ్యం అంతగా బాగోలేదు. ఇప్పుడు ఒక చేతికర్ర సహాయముతో నడుచుచున్నట్లు వార్త. ఆయన ఆరోగ్యం కొరకు ప్రార్థించండి.

3. జూన్ నెల 22వ తేదీన సోదరులు జాషువా గూటంగారు ముంగండకు సమీపముగా యున్న ముంజవరం గ్రామం

సందర్శించారు. అక్కడ జరిగిన చక్కటి సువార్త కూటములో వాక్యాన్ని అందించగా 9 మంది స్త్రీలు సువార్తకు లోబడ్డారు. ముంజవరంలో సోదరులు J. రెడ్డి స్టీవెన్‌గారు మంచి పని చేయుచున్నారు.

4. జూన్ ఆఖరి వారంలో తిరుమాలి గ్రామము నుండి ఇద్దరు వ్యక్తులు కాకినాడకు వచ్చి బాప్తిస్మము పొందారు. వారు రేడియోలో సువార్త వినుట మాత్రమే గాకుండా, సోదరులు K. రాజబాబుగారి ద్వారా సత్యవాక్యమును మరింత విపులంగా విని విశ్వసించి ప్రభువుకు లోబడ్డారు. వీరందరికొరకై ప్రార్థించుదాం.

---

## ఎన్నడు మారని సంగతులు

## ( Things That Never Change )

ఈ లోకము నానాటికి మారిపోవుచున్నది. గత రెండుమూడు దశాబ్దాలలోను మన దేశంలో ఎన్నో గొప్ప మార్పులు సంభవించాయి. మారిపోవుచున్న ఈ సమాజంలో మారని కొన్ని సంగతులను దేవుడు మనకొరకు యిచ్చాడు.

### మార్పులేని రక్షకుడు

మార్పులేని రక్షకుడు మనకున్నాడు. "యేసుక్రీస్తు నిన్న, నేడు ఒక్కటే రీతిగా ఉన్నాడు; అవును యుగయుగములకును ఒక్కటే రీతిగా ఉండును" (హెబ్రీ 13 : 8). మానవుల యెడల ఆయన చిత్తములోను, సంకల్పములోను మార్పు లేదు.

## నిశ్చలమైన రాజ్యము

మనము నిశ్చలమైన రాజ్యమును పొందియున్నాము (హెబీ్రి 12 : 28). అది మార్పులేని సువార్తపై ఆధారపడి యున్నది గనుక మార్పు జెందదు. అది పరిశుద్ధులకు ఒక్కమారే అప్పగింపబడిన బోధను బట్టి యున్నది (యూదా : 3). గోదుమగింజను ఎప్పుడు ఎక్కడ నాటినా అది గోధుమలనే ఉత్పత్తి చేయును. అట్లే వాక్య మైన విత్తనము ప్రజల హృదయాల్లో విత్తబడినప్పుడది పవిత్రమైన క్రొత్త నిబంధన క్రైస్తవులనే తయారుచేయును.

క్రీస్తు ఈ లోకంలో యున్నప్పుడు రాజ్యము తన అపొస్తలుల జీవిత కాలములోనే వచ్చునని చెప్పెను. "మరియు ఆయన ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచి చూడరని మీతో నిశ్చయముగా చెప్పు చున్నాననెను" (మార్కు 9 : 1). క్రీస్తు పునరుత్థానుడైన తరువాత పెంతెకొస్తునాడు ఆ రాజ్యము పరిశుద్ధాత్మ శక్తితో వచ్చెను (అపొ. కా. 2 : 1-4; 47). క్రైస్తవులందరు ఆ రాజ్యమై యున్నారని పౌలు చెప్పెను (కొల 1 : 13). క్రైస్తవులు సత్యమునకు స్థంభమును ఆధారమునై యున్నప్పుడు, ఎక్కడ ఉన్నను వారిలో లేక ఆ రాజ్య ములో మార్పు లేదు.

## మార్పులేని చట్టము

"స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణ నియమము" ఇప్పుడేరీతిగా యున్నదో, ఈ లోకాంతము వరకు అదే రీతిగా యుండును (యాకోబు 1:25). మానవులలో అత్యంత మేధావుల మనుకొన్నవారు సువార్తకు

వ్యతిరేకంగా ఏకమైనా, వారు మరణించారు గాని దేవుని వాక్యము సజీవమై యున్నది. సత్యానికి వ్యతిరేకంగా రోమా సామ్రాజ్యం తన శక్తినంతా వినియోగించింది. అయితే ఈనాడు దాని శిథిలాలు మాత్రం మిగిలాయి, గాని దేవుని వాక్యం కోట్లాది ప్రజల హృదయాల్లో, జీవితాల్లో సజీవమై యున్నది (1 పేతురు 1 : 24, 25).

అందువలన మనం స్థిరులుగా యుండాలి. పౌలు ఇట్లు హెచ్చరించాడు : "కావున నా ప్రియ సహోదరులారా, మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థము కాదని యెరిగి, స్థిరులును కదలని వారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులునై యుండుడి" (1 కొరింథీ 15 : 58).

—వెల్డన్ లాంగ్‌ఫీల్డ్.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA 533 001

No.

To
..............................................
..............................................
..............................................
..............................................